సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 21 । డిసెంబర్ । 2023



రుణాల పేరుతో మోసం

బి.కొత్తకోట కేంద్రంగా గ్రైండర్లు విక్రయిస్తూ రుణాల పేరిట నగదు వసూలు చేశారు. ఒక్కో మహిళ నుంచి రూ.4.800 చొప్పున వసూలు చేసి పరారయ్యారు. -8లో



క్రీడలతో శారీరక దారుఢ్యం

క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 211 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	463	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 184.800 కిలోలు

వైద్యవనం.. అధునాతనం

కడప గడపలో రిమ్స్ వైభవం!

- ప్రారంభోత్సవానికి సిద్ధమైన మూడు ప్రత్యేక భవన సముదాయాలు
- నాడు తండ్రి అడుగులకు దీటుగా ముందడుగు వేసిన తనయుడు వైఎస్ జగన్
- పుట్టినరోజు కానుకగా జిల్లాకు వైద్య వనం
- నేడు వాడవాడలా విస్తృత సేవా కార్యక్రమాలు



నిర్మాణంలో వున్న కేన్సర్ హాస్పిటల్ భవనం



కడప రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ విభాగం

సాక్షి ప్రతినిధి, కడప: 'పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాన్న రెండు అడుగులు ముందుకేస్తే, ఆయన కొడుకుగా నాలుగు అడుగులు ముందుకేస్తా... మీ బిడ్డగా నాక్కావాల్సింది మీ ప్రేమాభిమానాలు... ప్రతి ఇంట్లో ఉన్నట్లు నాన్న ఫొటో పక్కన నా ఫొటో కూడా చేరాలి'.. విపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అచ్చం అలాగే పేదలకు పెన్నిధిగా మారారు. సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. పుట్టిన గడ్డ వైభవోపేతానికి విశేషకృషి చేస్తున్నారు. కడప గడపలో రిమ్స్ వైద్య వనం అందుబాటులోకి తెచ్చారు. పుట్టినరోజు కానుకగా జాతికి అంకితం చేయనున్నారు. దశదిశలా రిమ్స్ వైభవాన్ని చాటిచెప్పనున్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని తపించారు. 230 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లు వ్యయంతో 'రిమ్స్'వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. ఈనేపథ్యంలో డాక్టర్ వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిమ్స్ ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.272.81కోట్లతో మూడు ప్రత్యేక విభాగాల వైద్యశాలలను అందుబాటులోకి తెచ్చారు. ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.125కోట్లతో 452 పడకల సూపర్ స్పెషాలిటీ విభాగం, రూ.40.81 కోట్లతో 100 పడకల మానసిక వైద్యశాల, మరో రూ.107 కోట్లతో 100 పడకల కేన్సర్ హాస్పిటల్ నిర్మించారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై కడప గడపలో రిమ్స్ వైద్య వనంలో అందనున్నాయి. దీంతోపాటు వంద పడకల కేన్సర్ హాస్పిటల్, వంద పడకల మానసిక వైద్యశాల అందుబాటులోకి రావడంతో జిల్లా వాసులకు ఎంతో ఉపశమనం దక్కనున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

సీఎం బర్త్‌డే కానుకగా....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కానుకగా జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను అందుబాటులోకి తెస్తున్నారు. కడప పురవీధులు, 12 సర్కిళ్లల్లో రూపురేఖలు మారుస్తున్నారు. రూ.120కోట్ల వ్యయంతో సుందర కడపగా తీర్చిదిద్దారు. బుగ్గవంక ప్రొటెక్షన్‌వాల్‌కు ఇరువైపులా రహదారులు సిద్ధం అవుతున్నాయి. ఇవన్నీ జాతికి అంకితం అయిన తర్వాత నగరవాసులకు ఎంతో ఉపశమనం దక్కనుంది. ఆదరించి అక్కున చేర్చుకున్న జిల్లా వాసుల మదిలో చిరస్థాయిగా నిల్చేందుకు ప్రణాళికలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సక్సెస్ అయ్యారని పలువురు కొనియాడుతున్నారు. కాగా గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

నాడు వైఎస్సార్.. నేడు జగన్‌తోనే సాధ్యం



నాటి కడప జిల్లా నేటి వైఎస్సార్ జిల్లా వైఎస్ కుటుంబం చల్లని చూపుతోనే అభివృద్ధి చెందింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో మరింత వేగంగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారు. కడప రూపురేఖలను మార్చారు. నాడు వైఎస్సార్, నేడు జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమైంది. -ఎస్‌బీ అంజాద్‌బాషా, డిప్యూటీ సీఎం

సీఎం ప్రణాళిక మేరకే పనులు



జిల్లా సమగ్రాభివృద్ధి, పారిశ్రామికప్రగతికి సీఎం వైఎస్ జగన్ రచించిన ప్రణాళికలు మేరకే అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.కడప సుందర నగరంగా మారింది. జంక్షన్లు రూపురేకలు మారిపోయాయి. ఇవన్నీ ఈనెల 23న సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. -విజయరామరాజు,వైఎస్సార్ జిల్లా కలెక్టర్

ఇకపై సూపర్ స్పెషాలిటీ సేవలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఇకపై సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రాను న్నాయి. వరస క్రమంలో ఏడు రకాల స్పెషాలిటీ వైద్యం కడపలో దక్కనుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటిన రిమ్స్ మొక్క నేడు మహావృక్షమై ప్రజలకు కల్పతరువుగా మారనుంది. - డాక్టర్ సుర్వేశ్వరరెడ్డి, సూపరింటెండెంటు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సెంచురీ పానెల్స్ పరిశ్రమ ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23, 24, 25 తేదీలలో వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా బుధవారం కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటించే ప్రాంతాలను వారు సందర్శించారు.

- కడపలోని రిమ్స్‌లోని పలు విభాగాలతో పాటు వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లను పరిశీలించారు.

సెంచురీ ప్యానెల్స్‌లో..

గోపవరం: సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీలతో పాటు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సెంచురీ పానెల్స్ పరిశ్రమలోని ఎంటీఎఫ్, హెచ్‌డీఎఫ్ యూనిట్లను బుధవారం పరిశీలించారు. అలాగే పరిశ్రమ ఉద్యోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు

పులివెందులలో..

పులివెందుల రూరల్: సీఎం పర్యటన నేపథ్యంలో పులివెందుల మెయిన్ బజార్‌లో జరుగుతున్న సెంట్రల్ బోలేవార్డు అభివృద్ధి పనులను బుధవారం సాయంత్రం కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. మోడల్ టౌన్ అభివృద్ధి పనులను, సీఎస్ఐ చర్చి ఆవరణ తదితరాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ గణేష్ కుమార్, కడప కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓలు మధుసూదన్, వెంకటరమణ, వెంకటేశులుతో పాటు వివిధ శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంజన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో ధ్యానం చేస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి వెంకటనారాయణభట్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ మైదానం వద్ద ఉన్న వరాల ఆంజనేయ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణభట్ బుధవారం సాయంత్రం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి జరిగిన అభిషేకం, పూజల్లో పాల్గొన్నారు.

కౌశల్ యోజనలో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న జయశ్రీ, హాసినిపద్మ

మదనపల్లె సిటీ: కౌశల్ యోజన జిల్లా స్థాయి పోటీల్లో మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్‌లో మొదటి స్థానం దక్కింది. రాయచోటిలో జరిగిన కౌశల్ యోజన-2023 పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని బి.జయశ్రీ 'స్థిరమైన అభివృద్ధికి గ్రీన్ ఎనర్జీ' అనే అంశంపై ప్రథమస్థానం, హాసిని పద్మ ' ఇస్రో' అది సాధించిన విజయాలు' అనే అంశంపై ద్వితీయం స్థానంలో నిలిచారు. వీరికి భాస్కరన్ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరు విజయవాడలో 30వతేదీ జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

టీబీ చికిత్సలో జాగ్రత్తలు పాటించాలి

మదనపల్లె: వైద్యులు, వైద్యసిబ్బంది టీబీ చికిత్సలో తగిన జాగ్రత్తలు పాటించాలని టీబీ ముక్తభారత్ స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ నీరద అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఫ్రీ టీబీ ముక్త్ భారత్ ఐపీసీ ఆధ్వర్యంలో టీబీ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ అనే అంశంపై వైద్యులు ఆరోగ్యసిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టీబీ రోగులకు చికిత్స అందించడంపై వైద్యులు, సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టీబీ రోగులకు చికిత్సలు అందించే వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. చేతులు ప్రతిసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన పెంచుతున్నట్లు చెప్పారు. మైక్రోబయాలజిస్ట్ డాక్టర్.సందీప్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ ప్రసాదరాజు, నర్సింగ్ సూపరిండెంట్ నాగశ్రీ, వైద్యబృందం పాల్గొన్నారు.

ఆరుగురు డిబార్

వైవీయూ: వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బుధవారం వివిధ కోర్సులకు సంబంధించి 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 56 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు హాజరయ్యారు. హైపవర్ కమిటీ సభ్యులు, స్క్వాడ్ బృందాల తనిఖీలో కాపీలు కొడుతున్న ఆరుగురిని పట్టుకుని డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు.

లింగనిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం కఠినంగా అమలు

రాయచోటి అర్బన్: జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం అమలు కమిటీ చైర్మన్, ఆర్డీఓ రంగస్వామి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉష శ్రీ, డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా అధికారిణి దేవశిరోమణి, అడిషనల్ డీఎం హెచ్ఓ శైలజ మాట్లాడుతూ జిల్లాలోని రాయచోటి, పీలేరు పట్టణాల్లోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో విచక్షణా రహితంగా లింగనిర్ధారణ చేస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. వీరిపై చర్య తీసుకునేందుకు అధికా రులందరూ సహకరించాలని ఆర్డీఓను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణను చేస్తున్న ఆసుపత్రులపై చర్యలకు ప్రణాళికను రచిస్తున్నామన్నారు. సమావేశంలో ఎన్జీఓల సంఘం ప్రతినిధులు సురేంద్రారెడ్డి, ఫరీదా, నాగేశ్వరమ్మ, న్యాయవాది రెడ్డెప్పరెడ్డి, దిశ ఎస్ఐ రెడ్డెన్న, రెడ్డినాయక్, డిఈఓ దేవప్రసాద్, హెచ్ఈలు ఉష, రాజగోపాల్, హెచ్ఎస్‌డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



గుర్రంకొండ: రిజిష్టర్ తనిఖీ చేస్తున్న చంద్రానాయక్

గుర్రంకొండ/చిన్నమండెం: జిల్లాలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. బుధవారం గుర్రంకొండ, మండలంలోని సరిమడుగు, చిన్నమండెం-1 ఆర్బీకేలను సందర్శించారు. ఈసందర్భంగా ఆర్బీకేలోని ఎరువుల స్టాకు, పంపిణీ, అందుబాటులో ఉన్న రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రబీసీజన్‌లో రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. తప్పనిసరిగా పంటల నమోదు ధృవీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఈక్రాప్ నమోదు సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో పంట రుణాలు కూడా పొందవచ్చన్నారు. ఆర్బీకేల్లో రైతుభరోసా సిబ్బంది ఈ సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాయచోటి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు . బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఈ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలకు సంబంధించి ఇప్పటికే క్రీడా సామాగ్రి అన్ని మండలాల్లోని సచివాలయాలకు పంపించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రీడలలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని క్రీడాకారులందరూ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో గెలిచి మంచి పేరు తీసుకురావాలన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

రాయచోటి: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అన్ని మండలాల నుంచి సాంకేతికతతో కూడిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటిలో అర్చనా విద్యా సంస్థలో ఈనెల 23వ తేదీన జిల్లాస్థాయిలో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి మండల స్థాయిలో ఎంపికైన మూడు ప్రాజెక్టులు మాత్రమే జిల్లాస్థాయిలో ప్రదర్శించాలన్నారు. టీచర్ కేటగిరిలో టీచర్ మాత్రమే తన ప్రాజెక్టును ప్రదర్శించాలన్నారు. విద్యార్థులను అనుమతించరని తెలిపారు.

ఆటలకు.. సై

- రాయచోటిలో సర్వాంగ సుందరంగా క్రికెట్ స్టేడియం
- క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతుల కల్పన
- నేడు క్రికెట్ స్టేడియాన్ని ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



వైఎస్సార్ పెవిలియన్ భవనం



సిద్ధమైన క్రికెట్ మైదానం

సాక్షి రాయచోటి: కొత్త జిల్లా..కొత్త భవనాలు..నూతన క్రీడా మైదానంతో రాయచోటి మురిసిపోనుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆవిర్భవించిన అన్నమయ్య రూపురేఖలు మారుతోంది. ఒకవైపు ఆహ్లాదం, మరోవైపు వినోదానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే క్రీడలను ప్రోత్సహిస్తూ ఆడుదాం పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో క్రికెట్ స్టేడియం ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు అనుకున్నదే తడువుగా రాయచోటిలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేశారు.

అన్నిరకాల క్రీడలకు కోర్టులు

రాయచోటిలో క్రీడాకారులకు అనువుగా మైదానాలను తయారు చేసేందుకు అధికారులు ముందుకు కదులుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దిగువ అబ్బవరం ప్రాంతంలోని నక్కావాండ్లపల్లె వద్ద క్రికెట్ స్టేడియం, ఫుట్‌బాల్, ఫీల్డ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ బిల్డింగ్, అథ్లెటిక్ ట్రాక్, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ హాలు, కబడ్డీ తదితర ఆటలకు సంబంధించిన కోర్టులు, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించి నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే సుమారు 30 ఎకరాల స్థలాన్ని కేటాయించి..అందుకు అనువుగా చదును చేశారు. ఆటలకు సంబంధించి కోర్టులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. నక్కావాండ్లపల్లె నుంచి క్రికెట్ స్టేడియం వరకు డబల్ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి.

నేడు ప్రారంభం



క్రికెట్‌కు సంబంధించి నక్కావాల్లపల్లె సమీపంలో అన్ని హంగులతో స్టేడియం సిద్ధమైంది. వైఎస్సార్ పెవిలియన్ భవనం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. క్రికెట్ అసోసియేషన్ నిపుణుల ద్వారా టర్ఫ్ వికెట్‌ను రూపొందించాం. క్రికెట్ స్టేడియాన్ని అద్భుతంగా రూపుదిద్దాం. గురువారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా స్టేడియం ప్రారంభించనున్నాం. - పీఎస్ గిరీషా, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

అద్భుతంగా క్రికెట్ స్టేడియం

రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని నక్కావాండ్లపల్లె సమీపంలో సుమారు ఎనిమిది నెలలుగా కష్టపడి అధికారులు స్టేడియానికి రూపుతెచ్చారు. స్టేడియం నిర్మించే ప్రాంతంలో రాళ్ల తొలగించడం , జంగిల్ క్లియరెన్స్ చేయడమే కాకుండా మైదానాన్ని చదును చేశారు. స్టేడియం మొత్తం పచ్చదనం పెంపుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్టేడియంలోని నీరు బయటికి వెళ్లేందుకు డ్రైనేజీ సౌకర్యం కల్పించారు. అలాగే స్టేడియం చుట్టూ ప్రేక్షకుల కోసం గ్యాలరీల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. క్రికెట్ స్టేడియంలో రెండు క్రికెట్ పిచ్‌లను బెంగుళూరుకు చెందిన నిపుణుల ద్వారా ఏర్పాటు చేశారు. సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేశారు. వైఎస్సార్ పెవిలియన్ భవనం స్టేడియంలో క్రీడాకారులకు అనువుగా ఉండేలా రూపొందించారు. ఈ భవనంలో క్రీడాకారులు అటు, ఇటువైపు కూర్చొనేలా ఏర్పాట్లు చేయడంతోపాటు అక్కడనే వసతి, ఇతర సౌకర్యాలు కల్పించారు. పెవిలియన్ భవనంలో కూర్చొని మ్యాచ్‌లను తిలకించేలా వీఐపీలకు వసతి సౌకర్యాన్ని కల్పించారు.

ఉజ్వల భవితకు 'విద్యాదీవెన'



విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జేసీలు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యాదీవెన తోడ్పాటు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఒక వరమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం తాడేపల్లిలో క్యాంపు కార్యాలయం నుంచి 2023-24 సంవత్సరానికి 'జగనన్న విదేశీ విద్యాదీవెన'. 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం'పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లబ్ధి దారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో 'జగనన్న విదేశీ విద్యా దీవెన'పథకం కింద 10 మంది విద్యార్థులు రూ.92.21 లక్షలు, 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం'కింద 6గురు రూ.6.50 లక్షలు లబ్ధి పొందారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం కారణంగా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక విదేశీ విద్యాసంస్థల్లో చదువుకోవాలన్న కోరిక ఉన్న వారికి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం బాసటగా నిలిచిందని, వారి విదేశీ విద్యకయ్యే పూర్తి ఫీజును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందన్నారు. అలాగే యూపీఎస్సీ నిర్వహించే అత్యున్నత సివిల్ సర్వీసెస్‌లలో ఆంధ్రప్రదేశ్ యొక్క ప్రాతినిథ్యం పెంచేందుకు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం ద్వారా లక్ష రూపాయలు, రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. విద్యార్థులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు.అనంతరం మెగా చెక్కులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్, జేసీలు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదవాలనే కల నెరవేరింది



ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండడం సంతోషంగా ఉంది. విదేశాల్లో చదవాలనే మా లాంటి వారిక కలను ప్రభుత్వం నెరవేర్చింది. యూకేలోని యూనివర్శిటీ ఆఫ్ షెఫీల్డ్‌లో ఎంబీఏ చదువుతున్నాను. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.14.78 లక్షలు పొందాను. రేండో విడతగా నేడు రూ.6.75లక్షలు మంజూరైంది.
- ఎస్.జాహ్నవి, ప్రశాంత్‌నగర్, మదనపల్లి

సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధిస్తా



వ్యవసాయ ఆధారిత కుటుంబం మాది. డిగ్రీ తర్వాత ఉద్యోగం చూసుకోవాలనుకున్నా. సివిల్స్ చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారికి జగనన్న ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిసి సంతోషం కలిగింది. నేను సివిల్స్ చదువుతానని కలలో కూడా ఊహించలేదు. ప్రిలిమ్స్ పరీక్షకు హాజరుకావడానికి ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరు చేసింది. సివిల్స్‌లో మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధిస్తా. - కే.సాయికుమార్, కుమ్మరపల్లి, చిట్వేల్ మండలం

విమాన వీసా చార్జీలు కూడా ప్రభుత్వం చెల్లించింది



మా అబ్బాయి పేరు బి.శశికుమార్ ఇంజినీరింగ్‌లో మంచి ఉత్తీర్ణతతో పాసయ్యాడు. విదేశాల్లో చదువుకోవడానికి ప్రవేశ పరీక్షలో మా అబ్బాయి ఉత్తీర్ణత పొందాడు. కానీ విదేశీ విద్య ఖర్చులు భరించే స్తోమత లేదు. ప్రతిభ ఉండి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రస్తుతం మా అబ్బాయి స్కాట్లాండ్లో ఎమ్మెస్ చదువుతున్నాడు. జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ప్రభుత్వం ద్వారా రూ.18 లక్షలు ఆర్థిక సహాయం అందింది. విమాన వీసా చార్జీలను కూడా ప్రభుత్వం చెల్లించింది. ప్రతిభ గల విద్యార్థులను ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి శతకోటి వందనాలు. - బి.రమణయ్య, తంబళ్లపల్లి

20 లీటర్ల సారా స్వాధీనం


నిందితుని అరెస్టు చూపుతున్న సీఐ గురుప్రసాద్, తదితరులు

కలకడ : మండలంలోని ఎనుగొండ పాళ్యెం సచివాలయం పరిధిలోని దిగువతాండా గ్రామానికి చెందిన బుక్కే చంద్రనాయక్ అనే వ్యక్తి సారాను తరలిస్తుండగా అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎస్‌ఈబీ సీఐ గురు ప్రసాద్ తెలిపారు. ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే దిగువతాండాకు తర్పు వైపు గల అటవీ ప్రదేశాల్లో తనిఖీ చేసి 600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఏఈఎస్ వినోద్‌కుమార్, ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద్, సుధాకర్, బాలక్రిష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

– బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు


విజేతలతో కమాండెంట్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు

సిద్దవటం : క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు అన్నారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం 16వ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023 మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత బెటాలియన్‌లోని కంపెనీల పోలీసులు కవాతు నిర్వహించగా కమాండెంట్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ క్రీడోత్సవాలు మనలో ఉన్న మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు ప్రతీకగా చెప్పుకోవచ్చన్నారు. పోలీసులకు 100 మీటర్లు, 800 మీటర్లు పరుగుల పోటీలు, క్రికెట్, వాలీబాల్, లాంగ్ జంప్, షాట్‌పుట్, షటిల్ క్రీడా పోటీలను నిర్వహించారు. 800 మీటర్ల పరుగు పోటీలో సి–కంపెనీకి చెందిన కె. అనిల్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో డి–కంపెనీకి చెందిన యు. రవి, మూడవ స్థానంలో ఎఫ్– కంపెనీకి చెందిన టి. అశోక్ గెలుపొందగా వారికి కమాండెంట్ శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెట్లు వి. కేశవరెడ్డి, కె. వెంకట్‌రెడ్డి, వి. విజయప్రసాద్, ఎస్.డి. ప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల పేరుతో మోసం

- ఒక్కో మహిళ నుంచి రూ.4,800 చొప్పున వసూలు చేసి పరారైన ఫైనం
- బి.కొత్తకోట కేంద్రంగా గ్రైండర్లు విక్రయిస్తూ రుణాల పేరిట వసూళ్లు


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత మహిళలు


మోసగాడి ఇంటివద్ద మహిళల ఆందోళన

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట : తమ వద్ద చౌకగా లభిస్తున్న నాణ్యమైన గ్రైండర్లు కొనుగోలు చేయండి. అనంతరం మా సంస్థలో సభ్యులుగా చేరి తక్కువ వడ్డీకి ఇచ్చే రుణాలతో మీ జీవితాలను బాగు చేసుకోండి అని పలువురు అమాయక మహిళలను నమ్మించారు. అనంతరం వారి నుంచి డబ్బు వసూలు చేసి మహిళలకు కుచ్చుటోపీ పెట్టి పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని బూర్లపల్లి పంచాయతీ సొన్నువారిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత మహిళల కథనం మేరకు వివరాలిలా... సొన్నువారిపల్లెలో మొత్తం 92 నివాస గృహాలు ఉండగా పల్లె ప్రజలంతా భవన నిర్మాణ పనుల్లో భాగంగా దినసరి కూలి పనులకు వెళ్లేవారు. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం గుర్తు తెలియని పలువురు వ్యక్తులు కార్లలో గ్రామానికి వచ్చి రూ.4,800ల చొప్పున మొదట్లో కొంత మంది మహిళలకు గ్రైండర్లు విక్రయించారు. అనంతరం తమ వద్ద గ్రైండర్లు కొన్న ఒక్కో మహిళకు 80 పైసల వడ్డీతో రూ.50 వేల చొప్పున రుణాలిస్తామని నమ్మ బలికారు. ప్రతి నెలా రూ.2,500ల చొప్పున కంతుల వారీగా చెల్లిస్తే చాలన్నారు. రుణాలిస్తే ఏదో పాడి ఆవులు తెచ్చుకుంటే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని భావించిన 26 మంది మహిళలు రూ.4,800ల చొప్పున మొత్తం రూ.1.25 లక్షల నగదును అందించారు. రోజులు, వారాలు, నెలలు గడచినా కట్టిన డబ్బులకు గ్రైండర్లు కూడా ఇవ్వకపోవడంతో పాటు వారి సెల్ ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయామని గ్రహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాము ఒంగోలుకు చెందిన వారమని అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో తమకు ప్రధాన కార్యాలయం ఉందని చెప్పారన్నారు. ఇక్కడికి సమీపంలోని బి.కొత్తకోట దిగువ బస్టాండ్‌లో శ్రీ కనక మహాలక్ష్మి హోం ఫైనాన్స్ పేరిట అద్దె ఇంట్లో సబ్ బ్రాంచ్ ఉన్నట్లు పేర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం మహిళలు విషయాన్ని స్థానిక సర్పంచ్ సుబ్బిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆధ్వర్యంలో బి.కొత్తకోటలో ఉంటున్న ఫైనాన్స్ నిర్వాహకుల అద్దె ఇంటి వద్దకు వెళ్లారు.

బి.కొత్తకోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

బుధవారం బాధిత మహిళలు బి.కొత్తకోట తాకాటంవారిపల్లె రోడ్డులో అద్దె ఇంటి వద్దకు వెళ్లి చూడగా తాళాలు వేసి ఉండటం గమనించారు. అక్కడినుంచి బూర్లపల్లె సర్పంచు సుబ్బిరెడ్డి సాయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తర్వాత అద్దె ఇంటి వద్దకు చేరుకుని ఇంటిలో గ్రైండర్లు ఉంటాయని తలుపులు తెరవాలని ఇంటి యజమానులను కోరారు. అంతలో అక్కడికి చేరుకున్న ఏఎస్‌ఐ బొజ్జేనాయక్, పోలీసులు నిబంధనల ప్రకారమే తలుపు తెరవాల్సి ఉంటుందని సూచించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తలుపులు తెరుస్తామని చెప్పడంతో మహిళలు వెనుదిరిగి వెళ్లిపోయారు.



జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష పథకం ద్వారా వలంటీర్లు మా గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అధికారుల ద్వారా మాకు సర్టిఫికెట్లు అందించారు. ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాము.

– లక్ష్మీ నరసయ్య, పుల్లంపేట


సొంతింటి కల నెరవేరింది



పూరి కొట్టంలో ఉంటూ ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక అవస్థలు పడుతున్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో సొంతింటి కల నెరవేరింది. ప్రభుత్వం మాకు గృహం మంజూరు చేసింది. దీంతో మా సొంతింటి కల నిజమైంది. ప్రస్తుతం సొంత ఇంటిలో హాయిగా జీవిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– సుంకర సిద్దమ్మ, చిట్వేలి గ్రామం, అన్నమయ్య జిల్లా

వెంకన్న దర్శనం కోసం బయలుదేరి మృత్యువాత


మృతి చెందిన బల్లి అఖిల్‌తేజ

ఒంటిమిట్ట : వెంకన్న దర్శనం కోసం బయలుదేరిన బల్లి అఖిల్‌తేజ (26) అనే యువకుడు ఒంటిమిట్ట మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రామతీర్థంలో బుధవారం మృతి చెందాడు. కడప సాయిపేటకు చెందిన బల్లి అఖిల్‌తేజ గోవింద మాల వేసుకున్నాడు. మూడురోజుల క్రితం కడప నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరాడు. ఆయన ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో రాత్రి బసచేసి ఉదయం స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు రామతీర్థంలో పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. రెండు రోజులుగా ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలతో పాటు తిరుపతి ప్రాంతాల్లో వెతికామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రామతీర్థంలో శవమై కనిపించాడని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు సాయిపేటలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్థానికులతో కలిసి తిరుమల పాదయాత్రకు బయలుదేరాడు. మృతిపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి తీవ్ర గాయాలు


గాయపడిన హరికిరణ్‌రెడ్డి

రామాపురం : కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం సుద్దమళ్ల రోడ్డు క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టేట్‌బ్యాంకు ఉద్యోగి హరికిరణ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడప నగరం ప్రకృతి నగర్‌కు చెందిన హరికిరణ్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె స్టేట్ బ్యాంకులో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. డ్యూటీ పూర్తి చేసుకుని బైకుపై కడపకు బయలుదేరారు. సుద్దమళ్ల క్రాస్ వద్దకు రాగానే సుద్దమళ్ల నుంచి రామాపురం వస్తున్న ప్రైవేటు స్కూల్ బస్సును బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో హరికిరణ్‌రెడ్డి ఎడమ కాలు పూర్తిగా విరిగి తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంటనే రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

క్రీడలలో లయోలా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : ఈనెల 18, 19 తేదీలలో రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్,గేమ్స్ మీట్‌లో పులివెందుల లయోలా పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంథోని స్వామి, ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టోలు తెలిపారు. బుధవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్‌లో వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు గేమ్స్‌లో టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో విన్నర్స్‌గా నిలిచారన్నారు. అలాగే వాలీబాల్ పోటీలో రన్నర్స్‌గా నిలిచారన్నారు. షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, 100 మీటర్ల, 200 మీటర్ల, 800 మీటర్ల పరుగు పందెం పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. అలాగే రిలేలో ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. ప్రతిభ చూపిన తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ విజయరాజు, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ దొంగ అరెస్టు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో హుండీ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌ల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ముదిగుబ్బ వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వస్తుండగా వారిని ఆపేందుకు ప్రయత్నించామన్నారు. వారు కొండ పొదల్లోకి పారిపోయారన్నారు. వారిలో ఒకరిని పట్టుకుని విచారించగా.. ధర్మవరానికి చెందిన పవన్‌గా గుర్తించామన్నారు. మూడు నెలల క్రితం అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ దేవాలయంలోని హుండీ దొంగతనంతో పాటు రెండు నెలల క్రితం సిద్ధవటం మండలం గంగమ్మ ఆలయంలో కూడా దొంగతనం చేసినట్లు అంగీకరించాడన్నారు. అతని వద్ద నుంచి రూ.39,392ల డబ్బు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కర్నాటకకు చెందిన పాండు అనే నిందితుడు పరారయ్యాడని తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొని

నీటి గుంతలో కారు బోల్తా

భర్త మృతి... భార్య పరిస్థితి విషమం


మృతి చెందిన చిన్నసిద్దయ్య


ప్రమాదంలో తీవ్రంగా గాయడిన జయమ్మ


నీటి గుంతలో బోల్తాపడిన కారు


ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

కేవీపల్లె : ద్విచక్రవాహనాన్ని ఢీకొని నీటి గుంతలోకి కారు బోల్తాపడిన సంఘటన మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లె సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జిల్లేళ్లమంద పంచాయతీ బసన్నగారిపల్లెకు చెందిన చిన్నసిద్దయ్య (62), ఆయన భార్య జయమ్మ ఇద్దరు సొంత పనిపై ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంలో పీలేరుకు వెళ్లారు. పీలేరు నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలోని చింతమాకులపల్లె వద్ద సుండుపల్లె నుంచి పీలేరుకు వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంపై దూసుకుపోయి పక్కనే ఉన్న నీటిగుంతలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నసిద్దయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయమ్మతో పాటు స్వల్పగాయాలతో బయటపడిన కారులోని సుబ్బరాయుడు, స్వప్నకళను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జయమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేవీపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులమందు తాగి వివాహిత ఆత్మహత్య


రామసముద్రంలో మృతి చెందిన సావిత్రమ్మ

రామసముద్రం : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీ పెద్ద అలసాపురం గ్రామానికి చెందిన వెంకట్రమణ , వెంకటమ్మల మూడవ కుమార్తె సావిత్రమ్మ(40) ను రామసముద్రం మండలం నారిగానిపల్లె పంచాయతీ పూలకుంట్లపల్లె గ్రామానికి చెందిన లక్ష్మన్న కుమారుడు రంగప్పకు ఇచ్చి సుమారు 18 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. ఈ దంపతులకు వైష్ణవి, వేణు అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త రంగప్ప ఇంటిని సరిగ్గా పట్టించుకోకుండా తిరుగుతుండేవాడని, దీంతో ఇద్దరి మధ్య తరచు గొడవలు ఉండేవని తెలిపారు. గతంలో పెద్దలు రంగప్పకు సర్దిచెప్పినా అతనిలో మార్పు రాకపోవడంతో మనస్థాపానికి గురైన సావిత్రమ్మ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలు మహిళ మెడలో గొలుసు చోరీ


సీసీ కెమెరాలో రికార్డు అయిన మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లే దృశ్యం

మదనపల్లె : పట్టపగలే మెయిన్‌రోడ్డుపై మహిళ మెడలో గొలుసు చోరీ చేసి దర్జాగా పారిపోయిన ఘటన బుధవారం పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌లో జరిగింది. బండమీదకమ్మపల్లెకు చెందిన బోయపాటి లక్ష్మీదేవి(75) మధ్యాహ్న సమయంలో ఇంటి ముందు అరుగుపై కూర్చొని ఉంది. కుటుంబ సభ్యులు ఇంటిలోపల ఉన్నారు. వీరు పాలకేంద్రం నడుపుతూ, పశువుల దాణాను విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌పై వచ్చి ఒకరు ఆమె వద్దకు వెళ్లి ఏదో వివరాలు అడుగుతున్నట్లు ప్రయత్నిస్తూ, చుట్టుపక్కల ఎవరూ తనను గమనించడం లేదని నిర్ధారించుకుని లక్ష్మీదేవి మెడలోని గొలుసును లాక్కున్నాడు. వెంటనే మోటార్‌బైక్‌పై వేచిచూస్తున్న మరోవ్యక్తితో కలిసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ తతంగం మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయింది. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీ కెమెరా పుటేజిని అందజేశారు. దొంగ లాక్కెళ్లిన బంగారు చైన్ 35 గ్రాముల బరువు కలిగి రూ.2లక్షల విలువ చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

కూలీల వాహనం బోల్తా

– 8 మందికి తీవ్ర గాయాలు


గాయపడి రోదిస్తున్న కూలీలు

అట్లూరు : మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారి పక్కన ఉన్న వంకలో వ్యవసాయ కూలీల వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మహిళలకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు మండలం శీలంవారిపల్లికి చెందిన 12 మంది మహిళా కూలీలు సిద్దవటం మండలం ఎస్.రాజంపేట పొలాలలో వరినాట్లు వేసేందుకు ఏపీ 39 టీటీ 4627 నంబరు గల వాహనంలో బుధవారం తెల్లవారుజామున బయలు దేరారు. అట్లూరు మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం కాలనీకి సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు గోడ ఎక్కి వంకలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సునీతా, సనమ్మ, భాగ్యమ్మ, సనక్క, ఓబులమ్మ, బుజ్జమ్మ, సుజాతలకు కాళ్లు చేతులు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వాహనం బోల్తాపడిన వెంటనే సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసి 108 కు సమాచారం అందించారు. వెంటనే అట్లూరు, సిద్దవటం 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారు రోదిస్తున్న దృశ్యాలు చూపరులను కంట తడి పెట్టించాయి.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పగిడాల బైపాస్ రహదారి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని గోపాయపల్లెకు చెందిన మండ్ల శివప్రసాద్ (25) ప్రొద్దుటూరు నుంచి ఇంటికి వెళుతుండగా పగిడాల బైపాస్ రహదారి వద్ద ద్విచక్రవాహనాన్ని అదుపు చేయలేక కిందపడి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివప్రసాద్ ప్రొద్దుటూరులో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతునికి భార్య వరలక్ష్మీతోపాటు 5 ఏళ్ల, 3 ఏళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి పెద్ద దస్తగిరి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.